ఉత్తీర్ణతా శాతాన్ని పెంచాలి

- ఇంటర్మీడియట్ డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మారెడ్డి

మాట్లాడుతున్న రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మారెడ్డి

బిజినేపల్లి, జనవరి 8 : నైపుణ్య మైన విద్యను అందించి ఉత్తీర్ణతా శాతాన్ని మరింతగా పెంచాలని రాష్ట్ర ఇంటర్మీడియట్ డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పాలెం శ్రీ వేంకటేశ్వర ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అదనపు తరగతుల నిర్వాహణ చేపట్టాలన్నారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి మెరుగు పర్చాలన్నారు. అనంతరం కళాశాలకు నూతన భవనాన్ని మంజూరు చేయాలని అధ్యాపక బృందం కోరింది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆనం గౌడ్, మదన్ మోహన్‌రెడ్డి, గౌస్, గోపి, నర్సింహా, వెంకటయ్య, పద్మజ, వినోద్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ కళాశాల తనిఖీ..

తిమ్మాజిపేట, జనవరి 8: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఇంటర్మీడియల్ విద్యా డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మారెడ్డి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 90 రోజుల ప్రణాళికలో భాగంగా కళాశాలను సందర్శించినట్లు తెలిపారు.

యాక్షన్ ప్లాన్‌ను అమలు చేయాలి..

తాడూరు, జనవరి 8 : ఇంటర్మీడియట్ విద్యార్థులకు సంబంధించి ప్రభుత్వం నిర్దేశించిన 90రోజుల యాక్షన్ ప్లాన్‌ను అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఖచ్చితంగా అమలు చేయాలని ఇంటర్మీడియట్ బోర్డు డైరెక్టర్ లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

కళాశాలలో విద్యార్థుల హాజరు శాతం, అధ్యాపకులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఇంటర్ నోడల్ ఆఫీసర్ వెంకటరమణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

మెరుగైన ఫలితాలు సాధించాలి

విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న డీఈవో రమేశ్‌కుమార్

- డీఈవో రమేశ్‌కుమార్

వంగూరు, జనవరి 8 : ప్రభుత్వ పాఠశాలల్లో కృత్యాధార విధానంతో ఉపాధ్యాయులు బోధించి మెరుగైన ఫలితాలకు కృషి చేయాలని డీఈవో రమేశ్‌కుమార్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలు, కస్తూర్బా, కొండారెడ్డిపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను డీఈవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. కస్తూర్బాలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఐదు అంశాలను దృష్టిలో పెట్టుకొని విద్యాబోధన చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన అనేక మంది విద్యార్థులు ఉన్నత స్థానాలను అధిరోహించాలన్నారు. పదో తరగతి విద్యార్థులకు వారాంతపు టెస్టులు నిర్వహించి సామర్థ్యాల ఆధారంగా బోధన చేయాలని సూచించారు. ప్రతి నెలా మూడవ శనివారం జరిగే తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశంలో పిల్లల యాక్టివిటిని వారికి తెలియజేయాలన్నారు. ఇంటర్, పదో తరగతి పరీక్షలకు విద్యార్థులు పూర్తి స్థాయిలో సన్నద్ధం చేయాలన్నారు. డీఈవో వెంట కేజీబీవీ పర్యవేక్షణ అధికారి శోభారాణి, ఎంఈవో మర ఖీమో హనాచారి ఉన్నారు.

ప్రభుత్వ భూమిలో ఇండ్లు నిర్మించాలి

అచ్చంపేట రూరల్, జనవరి 8 : అచ్చంపేటలోని ఈద్గా వద్ద 293 సర్వే నెంబర్లలో ప్రభుత్వ భూమి అన్యాక్రాంతానికి గురవుతున్నదని, ఆ స్థలంలో ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి మల్లేశ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో బుధవారం ఏరియా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. నాగర్‌కర్నూల్ రోడ్డు ప్రధాన రహదారి ఈద్గా సమీపంలో కోట్ల విలువైన ప్రభుత్వ భూమి 4ఎకరాల 32కుంటల భూమి బీఆర్‌ఎస్ హయాంలో ప్రభుత్వ భూమిగా రికార్డుల్లో ఉండగా, నేడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అధికార పార్టీ అండదండలతో 16మంది తమ పేరుపై పట్టాదారు పాసు పుస్తకాల్లో పేరు నమోదు చేసుకున్నారని ఆరోపించారు. అధికారులు స్పందించి విచారణ చేపట్టి పేదలకు ఇండ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు.

కార్యక్రమంలో సీపీఎం నాయకులు నిర్మల, సైదులు, సయ్యద్, బక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యతో సమస్యలు పరిష్కారం కావు

- శ్రీశైలం సీఐ ప్రసాదరావు
- కరెంటు తీగలు పట్టుకొని వ్యక్తి ఆత్మహత్య
- మరో మహిళ ఆత్మహత్యాయత్నం

శ్రీశైలం, జనవరి 8 : ఆత్మహత్యలు చేసుకున్నంత మాత్రాన సమస్యలు పరిష్కారమవ్వవని శ్రీశైలం సీఐ ప్రసాదరావు అన్నారు. ఇటీవల కొద్ది రోజులుగా శ్రీశైలానికి వచ్చి బలవన్మరణానికి పాల్పడేందుకు యత్నించేవారి సంఖ్య ఎక్కువైందని ఆవేదన వ్యక్తం చేశారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని రాయదుర్గానికి చెందిన సుతారి కిశోర్, లక్ష్మి దంపతులకు ఇద్దరు పిల్లలు. కొంత కాలంగా భర్తతో గొడవలు పడుతూ తీవ్ర మనస్తాపానికి గురైన లక్ష్మి క్షేత్రానికి చేరుకుని బలవన్మరణానికి పాల్పడేందుకు ప్రయత్నించగా ఆలయ సెక్యూరిటీ సిబ్బంది, పోలీస్ కానిస్టేబుళ్లు రక్షించారు. సీఐ ప్రసాదరావు ఆమె భర్తను పిలిపించి పోలీస్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇప్పించారు.

వైర్లు పట్టుకొని వ్యక్తి ఆత్మహత్య..

కర్నూలు జిల్లా గూడూరుకు చెందిన దుర్గన్న (31) నాలుగు రోజుల కిందట క్షేత్రానికి వచ్చి స్వామిఅమ్మవార్ల దర్శనం చేసుకున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న అతడు ఆత్మహత్య చేసుకునేందుకు 33/11 కేవీ ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్‌లోని విద్యుత్ తీగలను పట్టుకున్నాడు. ఘటనలో తీవ్ర గాయాలపాలైన అతడిని సున్నిపెంట ప్రభుత్వ దవాఖానకు తరలించగా, పరీక్షించి మెరుగైన వైద్యం కోసం కర్నూల్‌కు తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

మృతుడి సోదరుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ట్రాక్టర్ కింద పడి వ్యక్తి మృతి

కల్వకుర్తి రూరల్, జనవరి 8 : ట్రాక్టర్ కింద వ్యక్తి పడి మృతి చెందిన ఘటన మంగళవారం రాత్రి కల్వకుర్తి మండలం లింగసానిపల్లిలో చోటుచేసుకున్నది. కల్వకుర్తి పట్టణ రెండో ఎస్సై రాంచందర్‌జీ కథనం ప్రకారం.. తెల్కపల్లి మండలం ఆలేరుకు చెందిన తిరుపతయ్య(50) కల్వకుర్తి నుంచి తెల్కపల్లి వైపు ట్రాక్టర్‌పై వెళ్తుండగా అదుపుతప్పి టైరు కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని తిరుపతయ్య మృతదేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బుధవారం తిరుపతయ్య భార్య లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రెండవ ఎస్సై రాంచందర్‌జీ పేర్కొన్నారు.

Government of Telangana
Panchayat Raj Engineering Department
OFFICE OF THE DISTRICT PANCHAYATHRAJ ENGINEER, PIU.DIVISION, NAGARKURNOOL
Chit Short Tender Notices DB/ATO/05/2024-25, Date:04-01-2025

Sl.No.	Mandal	Name of the work	Name of the grant	Estimated Cost (Rs. in lakhs)	Re marks
1.	Veldanda	Repairs to Govt BC Boys Hostel Veldanda (V&M)	DMFT	9.00	

Last date for receipt of application : 09-01-2025 upto 5.00PM
Issue of Tender Shedules : 09-01-2025 upto 5.00PM
The Tenders will be received 10-01-2025 upto 3.00PM
Opening of Tenders : 10-01-2025 upto 3.30PM
Cost of Tender Shedules Rs.1500/- in favour of DPRE PIU.DIVN.NGKL
Cost of 1% EMD in favour of DPRE PIU.DIVN. Nagarkurnool
Further details can be obtained for Dist. Panchayath Raj Engineer PIU Division, Nagarkurnool, Nagarkurnool District.

భూసేకరణ వేగవంతం చేయాలి

- ధరణి పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలి
- కలెక్టర్ సంతోష్
- అధికారులతో సమీక్ష సమావేశం

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

నాగర్‌కర్నూల్, జనవరి 8 : జిల్లాలో కొనసాగుతున్న సాగునీటి ప్రాజెక్టులకు కావాల్సిన భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ సంతోష్ అధికారులకు సూచించారు. వీటితోపాటు ధరణి పెండింగ్ దరఖాస్తులు, ధరణి, ల్యాండ్ కేసులు, కోర్టు కేసులపై అదనపు కలెక్టర్ సీతారామారావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు, తాసీల్దార్లు, నీటిపారుదల శాఖ అధికారులు, నేషనల్ హైవే అధికారులతో కలెక్టర్ బుధవారం సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని వివిధ సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణను వేగవంతం చేయాలని, క్షేత్రస్థాయిలో సమస్యలుంటే ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సర్వే అధికారులు త్వరితగతిన సర్వే ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలో భాగంగా మర్లపాడు తండా, కేశ్యతండా తరలింపు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. జిల్లాలో జాతీయ రహదారి కోసం కావాల్సిన భూసేకరణ ప్రక్రియను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ధరణి పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పూర్తి చేయాలన్నారు. అంతకు ముందు మండలాల వారీగా రెవెన్యూ, ధరణిలోని వివిధ అంశాలపై ఆర్డీవోలు, తాసీల్దార్లను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

మహిళా సాధికారతే లక్ష్యం..

నాగర్‌కర్నూల్, జనవరి 8 : మహిళా సాధికారతే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తున్నదని, స్వయం సహాయక సంఘాల ద్వారా సోలార్‌తో వెయ్యి మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయనున్నట్లు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. బుధవారం మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా సోలార్‌పవర్ ప్లాంట్‌ల ఏర్పాటు ప్రగతిపై ప్రజా భవన్ నుంచి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మంత్రి సీతక్క, దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖతోపాటు ఆయా శాఖల అధికారులు, కలెక్టర్లతో వీసీ నిర్వహించారు.

సోలార్ ప్లాంట్ల ఏర్పాటుతో వెయ్యి మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి ఇప్పటికే ఇంధన శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖలతో ఒప్పందం కుదిరిన నేపథ్యంలో జిల్లాల వారీగా భూమి సేకరణ ప్రక్రియ ను వేగవంతం చేయాలని కలెక్టర్లకు సూచించారు. ఇందుకు కలెక్టర్ స్పందించి జిల్లాలో సోలార్ పవర్‌ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు కవాల్సిన ప్రభుత్వ, ప్రైవేట్ స్థలాల ఎంపికకు జిల్లా యంత్రాంగం ఇప్పటికే గుర్తించినట్లు తెలిపారు.

కళాకారులకు అభినందన..

యువజనసర్వీసుల శాఖ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 28వ తేదీన జిల్లా కేంద్రంలో నిర్వహించిన సాంస్కృతిక పోటీల్లో నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో మొదటిస్థానం సాధించారు. దీంతో కళాకారులను బుధవారం కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.

రోడ్డు ప్రమాదాలను నివారించాలి..

రోడ్డు ప్రమాదాల నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంతోష్ అధికారులను ఆదేశించారు. రోడ్డుప్రమాదాల నియంత్రణ, మరణాలు సంభవించకుండా అవసర మైన లైటింగ్, స్పీడ్ బ్రేకర్లు, సైనేజ్ బోర్డులు, క్యాట్ ఐస్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వాహనదారులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు.

టీజీవో క్యాలెండర్ ఆవిష్కరణ..

టీజీవో నూతన సంవత్సర క్యాలెండర్‌ను బుధవారం కలెక్టర్ సంతోష్ తన చాంబర్‌లో ఆవిష్కరించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

కల్వకుర్తి రూరల్, జనవరి 8 : సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని కల్వకుర్తి ఎస్సై మాధవరెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని వైఆర్‌ఎం కళాశాలలో విద్యార్థులకు సైబర్ జాగుర్త దివస్‌లో భాగంగా సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు అపరిచితులకు తమకు సంబంధించిన ఎలాంటి సమాచారాన్ని పంచుకోవద్దన్నారు. సైబర్ నేరగాళ్లు ఫోన్ పలు రకాల లింక్‌లను పంపి వాటి ద్వారా బ్యాంక్ ఖాతా వివరాలు, పలు అంశాలను అడిగి తెలుసుకుని ఖాతాలో ఉన్న డబ్బులను పూర్తిగా ఖాళీ చేస్తారని తెలిపారు. అలాంటి లింక్‌లు పంపినప్పు ఓపెన్ చేయవద్దన్నారు. 100 డయల్, 1930 టోల్ ఫ్రీ సేవల గురించి విద్యార్థులకు వివరించారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై మాధవరెడ్డి

డ్రంకెన్ డ్రైవ్‌లో జైలుశిక్ష

కల్వకుర్తి రూరల్, జనవరి 8 : డ్రంకెన్ డ్రైవ్ కేసులో పట్టుబడిన వ్యక్తికి రెండు రోజుల జైలుశిక్షను కల్వకుర్తి సివిల్ కోర్టు న్యాయ మూర్తి కావ్య విధించినట్లు కల్వకుర్తి ఎస్సై మాధవరెడ్డి బుధవారం తెలిపారు. కల్వకుర్తి పట్టణంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా, ఆంధ్రప్రదేశ్ గుంటూరుకు చెందిన కొండల్ అనే వ్యక్తి డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడగా, అతడిని బుధవారం కల్వకుర్తి కోర్టులో హాజరుపర్చగా అతడికి రెండు రోజుల జైలుశిక్ష రూ. వంద జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కోడేరు, జనవరి 8 : మండల కేంద్రానికి చెందిన ఐకేపీ బుక్ కీపర్ మదన్‌మోహన్ మంగళవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు రఘువర్ధన్‌రెడ్డి, మండలాధ్యక్షుడు రాజశేఖర్ గౌడ్ తదితరులు బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మదన్‌మోహన్ భౌతికకాయంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. వీరి వెంట బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీశైలం, వెంకటస్వామి, సోమనాథ్, వెంకటస్వామి, రామకృష్ణ, యూత్ అధ్యక్షుడు రాజు, లాలు, లక్ష్మీకాంత్, రాముడు, ఆదిసాయిబాబు, రాంప్రసాద్ తదితరులు ఉన్నారు.

నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

కస్తూర్బాకు కంప్యూటర్ వితరణ

పెంట్లవెల్లి, జనవరి 8 : మండల కేంద్రం సమీపంలోని కస్తూర్బాగాంధీ విద్యాలయానికి రత్నగిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం కన్వీనర్ కేతూరి ధర్మతేజ కంప్యూటర్‌ను వితరణ చేశారు. రత్నగిరి ఫౌండేషన్ జాయింట్ మేనేజింగ్ ట్రస్టీ జూపల్లి జగన్ మోహన్‌రావు సహకారంతో కంప్యూటర్ తోపాటు, బ్యాట్లను పాఠశాల అధ్యాపకులకు అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యాక్రమంలో ఎస్‌వో సువర్ణ, ఉపాధ్యాయులు హేమలత, మంజుల, ఫౌండేషన్ సభ్యులు సాయిచరణ్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్‌ను అందజేస్తున్న ఫౌండేషన్ కన్వీనర్ ధర్మతేజ

మోడల్ హౌస్ నిర్మాణానికి భూమిపూజ

బిజినేపల్లి/తిమ్మాజిపేట, జనవరి 8 : బిజినేపల్లి, తిమ్మాజిపేట మండల కేంద్రాల్లోని ఎంపీడీవో కార్యాలయాల ఆవరణలో బుధవారం మోడల్ హౌస్ నిర్మాణానికి బుధవారం ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి భూమిపూజ చేశారు.

అనాథలకు అండగా ఉంటా..

నాగర్‌కర్నూల్ టౌన్, జనవరి 8 : అనాథలకు అండగా ఉంటానని ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని మున్నూరు ఫంక్షన్ హాల్‌లో అనాథ పిల్లల పుట్టిన రోజు వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు.

బిజినేపల్లి : భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి

మత్స్యకారులను వేధించడం మానుకోవాలి

చెన్నారం నల్లాచెరువు వద్ద మాట్లాడుతున్న ఆంజనేయులు

బల్మూరు, జనవరి 8 : మత్స్యకారులను భూస్వాములు వేధించడం ఆపాలని మత్స్యకారుల పారిశ్రామిక సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు అంజనేయులు, డైరెక్టర్ వెంకటయ్య అన్నారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని చెన్నారం నల్లచెరువు తూములను రెండురోజుల కిందట మాజీసర్పంచ్ ధ్వంసం చేసి, నీటిని బయటకు వదలడం జరిగిందన్నారు. చెరువులో విడిచిన చేపపిల్లలు మృతి చెందడంతో కొన్ని బయటకు పోవడంతో మత్స్యకారులకు నష్టం వాటిల్లిందన్నారు. అలుగును ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కోశాధికారి పాపయ్య, వెంకటయ్య, పుట్టలింగం, నిరంజన్ ఉన్నారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు

పెద్దకొత్తపల్లి, జనవరి 8 : పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలో బుధవారం వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. వాసవీ మాత ఆలయం వద్ద నిర్వహించిన పోటీలకు మహిళలు భారీగా హాజరయ్యారు. ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జ్యోతి, వరలక్ష్మి, కవిత, సాయిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ముగ్గులు వేసిన మహిళలు

కొత్త గ్రామపంచాయతీ అమలుకు ప్రతిపాదనలు

లింగాల, జనవరి 8 : మండలంలోని జీలుగుపల్లి తండా, మాడా పుల్ గ్రామాలను కొత్త పంచాయతీలుగా ఏర్పాటు చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ప్రస్తుతం జీలుగుపల్లితండా జీలుగుపల్లి పంచాయతీలో ఉండగా మాడా పుల్ గ్రామం సూరాపూర్ పంచాయతీ పరిధిలో కొనసాగుతున్నాయి.

కాగా, నూతన పంచాయతీ ఏర్పాటుకు సంబంధించిన వివరాలను సిద్ధం చేసి జిల్లాస్థాయి అధికారులకు పంపుతున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో చంద్రశేఖర్ బుధవారం తెలిపారు.

స్థాయి పెంచినా.. సిబ్బంది నిల్

- పాలెం దవాఖానలో వైద్య సేవలకు రోగుల అవస్థలు

బిజినేపల్లి, జనవరి 8 : మండలంలోని పాలెం ప్రభుత్వ దవాఖానలో స్టాఫ్‌నర్సులు లేక నిత్యం రోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. 30 పడకలకు స్థాయి పెంచినా రోగులను చూసే వారే కరువయ్యారు. గతంలో ఇక్కడ ఆరుగురు స్టాఫ్‌నర్సులు ఉండగా, మూడునెలల కిందట సాధారణ బదిలీ అయ్యారు. తిరిగి కేవలం ఒక్క స్టాఫ్‌నర్స్ మాత్రమే రావడంతో సిబ్బంది కొరత ఏర్పడింది. ఒక్క హెడ్‌నర్స్ మాత్రమే ఉండడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 9నుంచి సాయంత్రం 4గంటల వరకు మాత్రమే వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటున్నట్లు గ్రామస్తులు వాపోతున్నారు. రెగ్యులర్ డాక్టర్, మరో ఇద్దరు ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ డాక్టర్ మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ఒక ఏఎన్‌ఎం దవాఖానలోని క్వార్టర్స్‌లో ఉండి అత్యవసర సేవలు అందిస్తున్నారు. గతంలో ఇక్కడ పూర్తిస్థాయిలో స్టాఫ్‌నర్సులు ఉండి అన్ని రకాల రోగులకు వైద్యం అందించేవారు. ప్రస్తుతం సిబ్బంది లేక రోగులు జిల్లా కేంద్రానికి వెళ్లాల్సిన దుస్థితి నెలకొన్నది. దవాఖాన పరిధిలో పాలెం, గుడ్లనర్వ, కారుకొండ, వసంతా పూర్, లింగసానిపల్లి, ఖానాపూర్, వెంకటాపూర్, వడ్డెమాన్, సల్కర్‌పేట, అల్లీపూర్ గ్రామాలున్నాయి. దవాఖానలో ఉన్న ఎక్స్‌రే మిషన్ నిరుపయోగంగా మారింది. ఇక్కడ ఉన్న సిబ్బంది మాత్రం అచ్చంపేటలో డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నారు. కేవలం కొన్ని పరీక్షలు మాత్రమే ఇక్కడ చేస్తున్నారని, మందుల కొరత ఉందని స్థానిక ప్రజలు పేర్కొంటున్నారు. కనీసం జిల్లా ఉన్నతాధికారులు స్పందించి స్టాఫ్‌నర్సుల కొరత తీర్చి చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలకు వైద్య సేవలు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి

నాగర్‌కర్నూల్, జనవరి 8 : గురుకుల పాఠశాలల్లో చదివేందుకు అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సంతోష్ తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరంలో వివిధ గురుకులాల్లో ఆంగ్ల మాధ్యమంలో ప్రవేశాల కోసం ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరి 23వ తేదీన కామన్ ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహించనున్నదన్నారు. గురుకులాల్లో విద్యనభ్యసించాలనుకునే బాలబాలికలు ఆన్‌లైన్‌లో ఫిబ్రవరి 1వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

11న అచ్చంపేటకు మహాత్మాగాంధీ మునిమనవడు

అచ్చంపేట రూరల్, జనవరి 8 : మహాత్మాగాంధీ మునిమనవడు తుషార్ గాంధీ ఈనెల 11న అచ్చంపేటకు రానున్నారని రిటైర్డ్ ప్రొఫెసర్, గాంధీ స్మారకనిధి కన్వీనర్ విజయకుమార్ బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. గాంధీ స్మారక నిధి, గాంధీకింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న బాపుబాటలో సత్యశోధన వెయ్యి కిలో మీటర్ల పాదయాత్ర పూర్తి చేసుకొని 100వ రోజు అచ్చంపేటలో నిర్వహించే ముగింపు కార్యక్రమంలో గాంధీ మునిమనవడు తుషార్‌గాంధీ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారని ఆయన తెలిపారు.

టైలరింగ్ వర్కర్స్ యూనియన్ కార్యవర్గం ఎన్నిక

అచ్చంపేట రూరల్, జనవరి 8 : నియోజకవర్గ టైలరింగ్ వర్కర్స్ యూనియన్ కార్యవర్గం బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శ్రీరాములు, ప్రధాన కార్యదర్శిగా కిశోర్, ఉపాధ్యక్షులుగా బాలరాజు, రవి, కోశాధికారిగా నాని, ప్రచార కార్యదర్శిగా గణేశ్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

బుగ్గకాల్వ తండాకు బీటీ రోడ్డు వేయాలి

వెల్దండ, జనవరి 8 : మండలంలోని చెదురుపల్లి నుంచి బుగ్గకాల్వ తండా వరకు బీటీ మంజూరు చేయాలని చెదురుపల్లికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు అశోక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చెదురుపల్లి నుంచి బుగ్గకాల్వ తండా మీదుగా ఎర్రపల్లి, గోకారం, చారకొండకు నత్యం ప్రజలు వెళ్తారని, స్థానిక ఎమ్మెల్యే నిధులు మంజూరు చేయాలని కోరారు.

ఉత్తమ ఫొటోకు జాతీయ అవార్డు

జాతీయ అవార్డు అందుకుంటున్న ఫొటోగ్రాఫర్ లింగం

పెద్దకొత్తపల్లి, జనవరి 8 : హుస్సేన్ ఖాన్ ఏడో జాతీయ వర్క్‌షాప్ జనవరి 5, 6వ తేదీల్లో ఒడిశాలో నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌లో 100 మంది ఫొటోగ్రాఫర్లు పాల్గొనగా, బోండా తెగకు చెందిన సంప్రదాయాలపై తీసిన ఫొటో ఎగ్జిబిషన్‌లో పెద్దకొత్తపల్లి మండల కేంద్రానికి చెందిన లింగానికి జాతీయ అవార్డు వచ్చింది. ఈ సందర్భంగా బుధవారం మండలానికి చెందిన పలువురు ఫొటోగ్రాఫర్లు లింగాన్ని అభినందించారు.

వరినారులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

ఉప్పునుంతల, జనవరి 8 : వరినారుపై చలి ప్రభావం తీవ్రంగా ఉన్నందున నారు కొనలు ఎర్రబారి ఎదుగుదల లోపిస్తుందని, రైతులు తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి రమేశ్ బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. రాత్రివేళల్లో కొత్తనీరు పెట్టి ఉదయాన్నే తీసివేయాలన్నారు. నారుమడిని రాత్రిపూట టార్పాలిన్ లేదా యూరియా సంచులను కర్రలతో రాత్రిపూట కప్పి ఉదయాన్నే తీసేయాలన్నారు.

సమాజంలో ఆదర్శంగా నిలవాలి

మాట్లాడుతున్న ఇంద్రసేనారెడ్డి

ఉప్పునుంతల, జనవరి 8 : రెడ్డి సోదరులు సామాజిక సేవలో పాలుపంచుకుంటూ ఆదర్శంగా నిలవాలని రెడ్డి సేవాసమితి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని రెడ్డి భవనంలో నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. అనంతరం ఆటలపోటీలు, ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి రాజేందర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీబీ పరీక్షాకేంద్రం తనిఖీ

భౌరాపూర్‌లో చిన్నారులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో స్వరాజ్యలక్ష్మి

అమ్రాబాద్, జనవరి 8 : మండలంలోని భౌరాపూర్, అప్పాపూర్ చెంచుపెంటల్లో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిక్షయ్ శిబిర్ వంద రోజుల టీబీ పరీక్షా కేంద్రాన్ని డీఎంహెచ్‌వో బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడి ప్రజలతో మాట్లాడి ఆరోగ్య స్థితిగతులను తెలుసుకున్నారు. అనంతరం చెంచు పెంటల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో జిల్లా అదనపు వైద్యాధికారి వెంకటదాస్, డీపీవో రేణయ్య, వైద్యులు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించాలి

శ్రీశైలం, జనవరి 8 : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం బాధ్యతగా భావించాలని అధికారులు సూచించారు. బుధవారం స్వచ్ఛ శ్రీశైలం ప్లకార్డులు, బ్యానర్లతో ప్రధానాలయ గోపురం గంగాధర మండపం నుంచి అవగాహన ర్యాలీ నిర్వహించారు.